ఓదెల: మానేరు వాగు ఉధృతిని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

మంథని గోదావరి తీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి

పెద్దపల్లి/మంథని/కాల్వశ్రీరాంపూర్/ ఓదెల/సుల్తానాబాద్/ధర్మారం, సెప్టెంబర్2: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్ర మత్తం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ అధికారు లు, పోలీస్ శాఖ సిబ్బందికి సూచించారు. కలె క్టర్, రామగుండం సీపీ, అధికారులు జిల్లా లోని పలు ప్రాంతాల్లో సోమవారం పర్య టించారు. సహాయక చర్యలను పర్యవేక్షిం చారు. వరదలు, నీటి వనరుల నిర్వహణపై అదనపు కలెక్టర్లు జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, జే అరుణ శ్రీతో కలిసి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఎక్కడైనా లోతట్టు ప్రాంతాల ప్రజలు ముంపుకు గురై అవకాశం ఉంటే వెంటనే అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ గోదావరి నుంచి పెద్ద ఎత్తున వరద వస్తుందని, ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ వరదను దిగువకు విడుదల చేయాలన్నారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. భారీ వర్షాల దృష్ట్యా సోమవారం ప్రజావాణిని రద్దు చేశామని చెప్పారు. ఆర్డీవో బీ గంగయ్య, డీపీవో ఆశాలత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి : ఇండ్ల వివరాలను సేకరిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

మంథనిలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి తీరాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు. వరద ఉధృతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంథని పరిసర ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.జిల్లాలోని వివిధ నీటిపారుదల ప్రాజెక్టులకు వరద వచ్చే నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ ఆర్డీవో హనుమా నాయక్, మంథని మున్సిపల్ చైర్ పర్సన్ రమాదేవి, తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ పాలకవర్గం, వివిధ శాఖల అధికారులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు

అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం ఊరచెరువు, మీర్జంపేటలోని కొత్తపల్లి నక్కల ఒర్రె వద్ద చెప్యాల పవన్ గల్లంతైన ప్రమాద ప్రాంతంతో పాటు హుస్సేన్‌మియా వాగును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘటనకు సంభందించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, రోడ్ల వద్ద రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. ఏమైన సమస్యలు తలెత్తితే వెంటనే పోలీస్ కంట్రోల్ రూం 8712656597కు, స్థానిక పోలీసులు, లేదా 100కు కాల్ చేసి సహాయం పొందాలన్నారు. ఓదెల మండలం గుంపుల గ్రామంలోని మానేరు వాగుపై ఉన్న బ్రిడ్జి వద్ద నుంచి నీటి ఉధృతిని పరిశీలించారు. సీపీ వెంట పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, అడ్మిన్ డీసీపీ రాజు, సీఐలు సుబ్బారెడ్డి ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ లు వెంకటేశ్ అశోక్‌రెడ్డి , పోలీస్ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

వాగుల వద్దకు వెళ్ల వద్దు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు వాగుల వద్దకు వెళ్లవద్దని అదనపు కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాకలోని హుస్సేనిమియా వాగును స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంపీడీవో దివ్యాదర్శన్‌రావు, ఎంపీఓ సమిరెడ్డి తదితరులు ఉన్నారు

ముంపు ప్రాంతాలను సందర్శించిన ఆర్డీవో

ధర్మారం మండలం నందిమేడారం, చామనపల్లిలోని ముంపు ప్రాంతాలను పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సందర్శించారు. నంది రిజర్వాయర్ కట్ట కింద ఉన్న లోతట్టు ప్రాంతంలో వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం చామనపల్లిలో పర్యటించారు. తహసీల్దార్ రజిత, ఆర్ఐ-2 స్వరూప ఉన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు...

భారీ వర్షాల కారణంగా మహబుబాబాద్ సమీపంలో రైలు పట్టాలు దెబ్బతినడంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు పెద్దపల్లి జంక్షన్ మీదుగా వళ్లే పలు రైళ్లను సోమవారం దారి మళ్లించారు. సికింద్రాబాద్ -సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

కూలిపోయే ఇళ్లల్లో ఉండవద్దు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లల్లో ఉండవద్దని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ సూచించారు. చందపల్లి వద్ద గుండం చెరువు మత్తడిని పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసిస్తున్న వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని లేదా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లవచ్చనితెలిపారు.

18 ఇండ్లకు నోటీసులు

పెద్దపల్లిలో శిథిలావస్థలో ఉన్న 18 ఇండ్లకు నోటీసులు జారీ చేశామని కమిషనర్ తెలిపారు.ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా కాపాడుకోవాలని లేని పక్షంలో మున్సిపల్ చట్ట ప్రకారం ఆ ఇళ్లను తొలగిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శివ ప్రసాద్, కౌన్సిలర్ రాజం మహంత కృష్ణ, జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పులిపాక రాజు, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీహరి, వినయ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల రోడ్డంతా బురదమయం

పెద్దపల్లి కమాన్, సెప్టెంబర్ 2 : పెద్దపల్లి బీసీ గురుకుల బాలికల వసతి గృహానికి వెళ్లే రోడ్డు వర్షానికి బురదమయమైంది. కాలినడకన కూడా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు, టీచర్లు తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. గురుకుల విద్యాలయం పెద్దపల్లి పట్టణానికి దూరంగా పొలాల మధ్యలో ఉంది. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత నెలలో వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించి పరిసరాల్లో చెత్తా, చెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని, హాస్టల్‌కు వచ్చే రోడ్డును తాత్కాలిక మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతు పనులు చేయకపోవడంతో మళ్లీ బురదమయంగా మారి తల్లిదండ్రులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

బిల్ కలెక్టర్ కలెక్టర్ మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్ 2: విధి నిర్వహణలో ఉద్యోగి దుర్మరణం చెందడంతో కాల్వశ్రీరాంపూర్ లో విషాదం నెలకొంది. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్(22) మీర్జంపేట జీపీలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓటరు జాబితా వార్డుల వారీగా విభజన ఉండడంతో పంచాయతీకి వెళ్లి విధులు ముగించుకొని కాల్వశ్రీరాంపూర్ వస్తుండగా గల్లంతైన విషయం తెలిసిందే. ఘటనా స్థలానికి అధికారులు, పోలీసులు చేరుకొని మత్స్యకారుల సహాయంతో గాలించగా రాత్రి సమయంలో పవన్ మృతదేహం దొరికింది. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పెద్దపల్లి కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పవన్ తండ్రి సదయ్య ఓదెల మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పని చేసి నాలుగేండ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పవన్ కు మీర్జంపేటలో బిల్‌కలెక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. ఒక్కగానొక్క కొడుకు వరదలో చిక్కుకొని మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. తల్లి స్వరూప రోదించిన తీరు కలిచివేసింది.

ఎల్లంపల్లి 32 గేట్లు ఓపెన్

అంతర్గాం, సెప్టెంబర్ 2: కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరుగుతున్నది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఎల్లంపల్లిలో 14.8285 టీఎంసీల నీటిమట్టం చేరుకున్నది. ప్రాజెక్టులోకి 2,07,904 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, సోమవారం 32 గేట్లు ఎత్తి 2,98,667 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. దీనితో గోదావరిలె నీటి ప్రవాహం ప్రమాద స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఈ జీ స్వామి ప్రకటించారు.

వదలని వాన

కాల్వశ్రీరాంపూర్ :పెద్దరాత్‌పల్లి- చిన్నరాత్‌పల్లి వద్ద హుస్సేన్‌మియా వాగు ఉధృతి

- రెండోరోజు జిల్లావ్యాప్తంగా వర్షం
- మత్తడి దుంకుతున్న చెరువులు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

గోదావరిఖని/మంథని/మంథని రూరల్/ముత్తారం/జూలపల్లి/ఓదెల/కాల్వశ్రీరాంపూర్/కోల్‌సిటీ/పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 2: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మంథని డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లో వాగులు, వంకలతో పాటు గోదావరి, మానేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గోదావరి నదిపై ఉన్న శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోకి భారీగా వరద రావడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. గోదావరి, మానేరు నదులు వరద పోటెత్తుతూ నిండుగా ప్రవహిస్తున్నాయి. దీంతో గోదావరి, మానేరు నది పరీవాహక ప్రాంతాలైన మంథని, ముత్తారం, రామగిరి మండలాల్లో లోతట్టు గ్రామా ల రైతులను అధికారులు అప్రమత్తం చేశారు. మంథని గోదావరి తీరం వద్దకు వెళ్ల వద్దని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మంథని గోదావరి ఒడ్డు మీద ఉన్న శివుడి విగ్రహం వరకు నీరు చేరుతుండడంతో గోదావరి పరీవాహక ప్రాం తాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముత్తారం మండలంలోని మానేరు ఉప్పొంగి ప్రవహిస్తుంది. జూలపల్లి మండలంలో వాన దంచి కొట్టింది. జూలపల్లి-పెద్దాపూర్ గ్రామాల మధ్య హుస్సేనిమియా వాగుపై వంతెన నీట మునిగింది. వడ్కాపూర్-ధూళికట్ట గ్రామాల మధ్య హుస్సేనిమియా వాగుపై ఉన్న వంతెన నీట మునగడంతో రెండో రోజూ రాకపోకలు నిలిచాయి. వడ్కాపూర్-జూలపల్లి, తేలుకుంట-చీమలపేట,వెంకట్రావ్‌పల్లి-లోకపేట గ్రామాల మధ్య కల్వర్టుల పై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.మండలంలో నాలుగు ఇండ్లు కూలినట్లు తహసీల్దార్ బషీరొద్దీన్ తెలిపారు. వెంకట్రావ్‌పల్లిలో కన్నం లక్ష్మి, జూలపల్లిలో కనపర్తి ఆంజనేయులు, మల్లెత్తుల మల్లవ్వ, అమరగాని మల్లేశం ఇండ్లు, ప్రహరీలు కూలిపోయాయి. ఓదె మండలంలోని మానేరు వాగులో వరద పారుతుంది. కొలనూర్, గోపరపల్లిలో చాలా వరకు వరదతో పొలాలు దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొన్నారు. తహసీల్దార్ యాకన్న, పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి గ్రామాల్లో సోమవారం పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. జీలకుంటలో ఆదివారం రాత్రి పింగిలి రాజేందర్‌రెడ్డికి చెందిన ఎద్దు పై పిడుగు పడడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. దాదాపు రూ.75వేల వరకు నష్టం కలిగినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని చిన్నరాత్‌పల్లి-పెద్దరాత్‌పల్లి గ్రామాల మధ్యన హుస్సేన్‌మియా వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. పరీవాహక ప్రాంత గ్రామాలైన చిన్నరాత్‌పల్లి, మొట్లపల్లి, పెద్దరాత్‌పల్లిలోని పంట పొలాలు జలమయమయ్యాయి. కాల్వశ్రీరాంపూర్ లో మల్లయ్యకుంట ఉప్పొంగి పక్కనే ఉన్న శివాలయంలోకి వరద చేరింది. తారుపల్లి-మీర్జంపేట గ్రామాల మధ్యన ఉన్న కల్వర్టులు కూలిపోవడంతో ఇరు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.

గోదావరి ఇంటెక్‌వెల్ పంప్‌హౌజ్‌ను సందర్శించిన జీఎం

ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరదను దిగువకు విడుదలతో గోదావరిలో నీరు చేరగా సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ఇంటెక్‌వెల్ పంప్‌హౌజ్‌ను సందర్శించారు. గోదావరిలో నీటి ప్రవాహ స్థితిగతులను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జీడీకే 2ఏ మోరీ, 5 ఇంక్లైన్ మోరీని పరిశీలించారు. కాలువలతో ఉన్న చెత్త చెదారాన్ని తొలగించాలని ఆదేశించారు. ఇక్కడ ఎస్వోటు జీఎం రామ్మోహన్, ఇంజినీర్ డీ వెంకటేశ్వర్‌రావు, సివిల్ డీవైఎస్‌సీ వరప్రసాద్, ఏరియా రక్షణ అధికారి బైద్య, పర్యావరణ పరిరక్షణ అధికారి ఆంజనేయప్రసాద్, కిరణ్ బాబు, అధికారులు ప్రభాకర్, రమేశ్, దుర్గప్రసాద్, వీరారెడ్డి, ఇతర సివిల్ విభాగం అధికారులు ఉన్నారు.

రామగుండం బల్దియాలో కంట్రోల్ రూమ్

గోదావరిలో వరద ఉధృతితో తీర ప్రాంతాలకు నష్టం వాటిల్లకుండా రామగుండం నగర పాలక సంస్థ చర్యలకు ఉపక్రమించింది. బల్దియా కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ తెలిపారు. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వాహనాలు, పనిముట్లతో సహా సిబ్బంది ఉంటారని, సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు చేపట్టడానికి డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు వస్తాయన్నారు. అన్ని విభాగాల సిబ్బందికి సెలవులు రద్దు చేశామని పేర్కొన్నారు. సహాయం కావల్సిన వారు నగర పాలక సంస్థ హెల్ప్ లైన్ ఫోన్ నం.9603666444, టోల్ ఫ్రీ నం.18004257062కు సంప్రదించవచ్చని తెలిపారు.

తగ్గు ముఖంపడుతున్న వరదలు..

పెద్దపల్లి మండలంలోని వాగులు, వంకల్లో వరద ప్రవాహం సోమవారం కొంతమేరకు తగ్గుముఖంపట్టిందిజ ఎంపీవో ఫయాజ్‌అలీ ఆయా గ్రామాల కార్యదర్శులను అప్రమత్తం చేస్తూ పరిస్థితిన ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

పెద్దపల్లి కమాన్ : బురదగా మారిన గురుకుల స్కూల్ రోడ్డు

జూలపల్లి : ఇంట్లోకి చేరిన వరద

పెద్దపల్లి రూరల్: కొత్తపల్లి-దస్తగిరిపల్లి గ్రామాల మధ్య రాకపోకల నిలిపివేత

అంతర్గాం : ఎల్లంపల్లి నుంచి దిగువకు వదులుతున్న వరద

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 2: పెద్దపల్లి నియోజవకర్గంలోని దాదాపు 1176 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 3 కోట్ల విలువైన చెక్కులను ఎమ్మెల్యే విజయరమణారావు సోమవారం అందజేశారు. పట్టణంలోని ఆర్‌కే గార్డెన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశా రు. వానకాలంలో రైతులు పండించిన సన్న వడ్లకు బోనస్‌గా రూ. 5 వందలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ తహసీల్దార్ రాజు కుమార్, నాయకులు కట్కూరి సుధకర్‌రెడ్డి, కడారి శ్రీనివాస్, కలవేన మహేం దర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, ఈర్ల స్వరూప, ఓదెలు యాదవ్, భూతగడ్డ సంపత్, నూగిల్ల మల్లయ్య, గుండేటి ఐలయ్యయాదవ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

పెద్దపల్లి, సెప్టెంబర్2: భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో పంట ల సంరక్షణకు రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారి చేయడం తాత్కా లికంగా వాయిదా వేయాలన్నారు. వరి, పత్తి, మక్కజొన్న పంటల కు నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలను ఆయన సూచించారు.

మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలి

పెద్దపల్లి, సెప్టెంబర్2: భారీ వర్షాల దృష్ట్యా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు కృషి చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌చార్జి డైరెక్టర్, పెద్దపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ బీ అశోక్ కుమార్ అన్నారు. పెద్దపల్లి ఎస్‌ఈ కార్యాలయంలో ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్‌తో కలిసి ఆయన విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరా పై నిత్యం పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయిలో సంబంధిత సిబ్బంది, అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ పున:రుద్ధరణ పనులు వేగవంతం చేస్తున్నామని పెద్దపల్లి ఎస్‌ఈ తెలిపారు.చెట్లు విరిగి స్థంబాల పై పడటంతో 3 పోల్స్ , 10 ట్రన్స్‌ఫార్మర్లు, 20 ఇన్సు లేటర్లు దెబ్బతిన్నాయని వివరించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. భారీ వర్షాలతో రూ. 1.50లక్షలు నష్టం వాటిల్లిందన్నారు. విద్యుత్ అంతరాయం, మరే ఇతర సమస్యలు ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912, 18004250028 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. డీఈ తిరుపతి, బాలయ్య, రవి, పెద్దపల్లి ఏడీఈ ఎం సత్యనారాయణ, ఏఈ బొంకూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో సురక్షిత ప్రసవాలకు చర్యలు

పెద్దపల్లి, సెప్టెంబర్2: ప్రభుత్వ దవాఖానల్లో సురక్షిత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. గర్భిణులకు అందించే వైద్య సేవలపై కలెక్టరేట్‌లో సోమవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు అద్భుతంగా సేవలందించిన వైద్యులను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలను వినియోగించుకుని గర్భిణుల ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్ 100 శాతం పూర్తి చేయాలని, ప్రతి గర్భిణీ తప్పని సరిగా 3 సార్లు ఏఎన్‌సీ చెక్ అప్ చేసుకొని అవసరమైన టీకాలు వేయించుకునేలా చూడాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే ప్రమోద్ కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వాణిశ్రీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు

ముత్తారం, సెప్టెంబర్ 2: ఆర్ఎంపీ, పీఎంపీలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ మం డల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్య వృత్తిని అణిచివేయాలన్న ధోరణితో రాష్ట్ర ప్రభుత్వం దాడులు చేయిస్తూ ఆర్ఎంపీ, పీఎంపీలను భయబ్రాం తులకు గురి చేస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం గ్రామీణ వైద్య వృత్తిని ప్రోత్సహించాలని కోరారు.

ఆర్ఎంపీలు, పీఎంపీల వైద్యసేవలు కొనసాగించాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 2: పేదలకు అందుబాటులో ఉంటూ ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీల వైద్యసేవలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బొంపల్లి వద్ద గ్రామస్తులు రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. పేదలకు తక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుని వైద్యం అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమలో మాజీ సర్పంచ్ కడారి కొమురయ్య, నాయకులు బండారు భూమయ్య, పంబాల రాజు, అరికిల్ల సాగర్, బత్తినిబ సతీశ్, మొల్గూరి శ్రీనివాస్, దబ్బెట చంద్రకళ, అరికిల్ల మధునమ్మ, పంబాల రాజమ్మ, సూర బుచ్చమ్మ, సూర లచ్చయ్య, బోదాసు రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్తు కనెక్షన్ మేళా...

పెద్దపల్లి, సెప్టెంబర్2: దారిద్ర్య రేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న వారు కొత్త విద్యుత్తు మీటర్ కనెక్షన్ పొందటానికి ఈనెల 15 వరకు విద్యుత్ కనెక్షన్ మేళా నిర్వహిస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఈ బొంకూరి సుదర్శన్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. బీపీఎల్ కుటుంబానికి చెందిన వారు కొత్తగా విద్యుత్తు మీటర్ కనెక్షన్ పొందటానికి మీ సేవా కేంద్రాల్లో కాకుండావిద్యుత్తు శాఖకు చెందిన అన్ని సెక్షన్ (ఏఈ) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. 500 వాట్స్ అవసరమున్న వారు రూ. 938, అలాగే 250 వాట్స్ అవసరమున్న వారు రూ. 818 చెల్లించి కొత్త కనెక్షన్ పొందవచ్చునన్నారు. కనెక్షన్ మేళాను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐఆర్ఎస్ఎంలో రామగుండం జట్టు విన్నర్

జ్యోతినగర్, సెప్టెంబర్ 2: ఎన్టీపీసీ సదరన్ రీజియన్‌లోని కుడ్గి ఎన్టీపీసీలో సోమవారం జరిగిన ఇంట్రా రీజియన్ స్పోర్ట్స్ మీట్ (ఐఆర్ఎస్ఎం)లో బ్యాడ్మింటన్ పోటీలో రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ జట్టు విన్నర్‌గా నిలిచింది.లాన్ టెన్నిస్ పోటీలో రామగుండం జట్టు ప్రాతినిథ్య జట్టుగా పోటీ పడింది. విజేత జట్టులో ఉద్యోగులు ఆర్ హరీశ్, పీ రాజేశ్, కే రవిబాబు, భోశన్ బాబు, పీ వీరబాబు, సోహన్‌సింగ్ ఉన్నారు. వీరిని ఎన్టీపీసీ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు అభినందించారు.

35శాతం లాభాల వాటా చెల్లించాలని వినతి

గోదావరిఖని, సెప్టెంబర్ 2: సింగరేణి వాస్తవ లాభాలను ప్రకటించి వెంటనే కార్మికులకు 35శాతం లాభాల వాటాను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సింగరేణి ఆర్జీ-1 పరిధిలో టీబీజీకేఎస్ వినతిపత్రాలు అందజేసింది. జీడీకే 1 ఇంక్లైన్‌లో పిట్ సెక్రటరీ బొగ్గుల సాయి ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంక్లైన్‌లో పిట్ సెక్రటరీ ఉప్పులేటి తిరుపతి, 2ఏ ఇంక్లైన్‌లో పిట్ సెక్రటరీ లక్ష్మణ్, ఓసీపీ 5లో పిట్ సెక్రటరీ అడ్డగుట్ట గోపీలు గని మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు.ఏరియా వర్క్‌షాప్‌లో జనగామ మల్లేశ్, జీడీకే 1 సీహెచ్‌పీలో రవి, ఆనలైటికల్ ల్యాబ్‌లో కేంద్ర కమిటీ సంయుక్త కార్యదర్శి చెల్పూరి సతీశ్ వినతిపత్రాలు ఇచ్చారు. నాయకులు ప్రదీప్, గడ్డి శ్రీనివాస్, మీస రాజు, శ్రీకాంత్, నరేశ్, గంగశ్రీను, వేణు, కళాధర్‌రెడ్డి, పొలాడి శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, రాము, రాజ్‌కుమార్, కొండ్ర అంజయ్య, వెంకటస్వామి, మధూకర్‌రెడ్డి ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 2 : సింగరేణి యాజమాన్యం 2023-24లోఆర్జించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2, 3 ఏరియా ఉపాధ్యాక్షులు ఐలీ శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్యలు వినతి పత్రాలు అందజేశారు. సోమవారం వేరువేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆర్జీ-2 ఏరియాలో డీజీఎం ఎర్రన్న, ఓసీపీ-1 మేనేజర్ ఉదయ్ హరిజన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికుల కష్టార్జితం లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించి అందులో నుండి 35శాతం వాటాను చెల్లించాలని కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఐ.సత్యం, బేతి చంద్రయ్య, మామిడి తిరుపతి, సురేందర్, బేతి రవితేజ, పింగిళి సంపత్ రెడ్డి, అల్లం తిరుపతిరెడ్డి, సైండ్ల సత్యనారాయణ, పోతరాజు, రవి, కుక్కల కుమార్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

రామగిరి, సెప్టెంబర్ 2: సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులు 35 శాతం చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు కోరారు. ఈమేరకు ఆర్జీ-3ఏరియా పరిధిలోనిఓసీపీ-2,ఆర్జీ-3 సెక్యూరిటీ విభాగంలో వేర్వేరుగా వినతి పత్రాలు సమర్పించారు. ఇక్కడ టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ రవిశంకర్, ఊరడి రమేష్, గండి శ్రీనివాస్, అల్లం రమేష్, చంద్రశేఖర్, శ్రావణ్, ప్రదీప్‌కుమార్, సతీష్, మల్లేశ్, ఇసంపల్లి రమేష్, శివ శంకర్, కొత్తపల్లి సదానందం, రమయ్య, కాసర్ల తిరుపతి, మామిడిపల్లి శ్రీనివాస్, ముజాఫర్, వెంకటస్వామి, ముజాఫర్ ఖాన్ తదితరులున్నారు.

ఆర్జీ-1లో 2,90,647 టన్నుల బొగ్గు ఉత్పత్తి

గోదావరిఖని, సెప్టెంబర్ 2: ఈ ఆర్థిక సంవత్సరంలో గడిచిన ఆగస్టు మాసంలో సింగరేణి ఆర్జీ-1 పరిధిలో 3,65,700 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 2,90,647 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో 79శాతం ఉత్పత్తి సాధించినట్లు ఆర్జీ-1 జీఎం సోమవారం డీ లలిత్‌కుమార్ వెల్లడించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో జీఎం పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు 31 వరకు 19,47,700 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంకు గాను 17,00,300 టన్నులతో 87శాతం ఉత్పత్తి సాధించినట్లు పేర్కొనారు. రానున్న రోజుల్లో ఉద్యోగులు, అధికారులు ఐక్యంగా రక్షణతో పని చేసి వందశాతం ఉత్పత్తి సాధించాలన్నారు. ఆర్జీ-1లో ఇప్పటివరకు 1,758 మంది ఉద్యోగులకు మెడికల్ ఇన్వాలిడేషన్ కాగా 1,506 మందికి కారుణ్య ఉద్యోగ నియామకపు ఉత్తర్వులు అందించినట్లు పేర్కొన్నారు. కంపెనీ తన సామాజిక బాధ్యత కింద సీఎస్ఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రీ ప్లాంటేషన్‌ను వివరించారు.

సింగరేణి ఆర్జీ-3లో 99 శాతం బొగ్గు ఉత్పత్తి

రామగిరి, సెప్టెంబర్ 2: సింగరేణి రామగుండం-3 డివిజన్ ఏరియాలో గడిచిన ఆగస్టులో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం సుధాకర్ రావు వెల్లడించారు. గత నెలలో ఆర్జీ-3 ఏరియాలకు నిర్దేశించిన 4.19 లక్షల టన్నుల లక్ష్యానికి గానూ 4.15 లక్షల టన్నులు వెలికితీసి 99 శాతం ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. అలాగే 38.30 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత లక్ష్యానికి గానూ 26.42 లక్షల క్యూబిక్ మీటర్లు వెలికితీసి 69 శాతం సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా 5.47 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు.

ఓబీలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

గోదావరిఖని/కోల్‌సిటీ, సెప్టెంబర్ 2: సింగరేణికి అనుబంధంగా ఉన్న ఓబీ కంపెనీల్లో స్థానిక కంపెనీ ప్రభావిత నిరుద్యోగులకు 80శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు పిటిషన్‌దారుడు మద్దెల దినేశ్ పేర్కొన్నారు. రామగుండం రీజియన్‌లో ఉన్న ఓపెన్‌కాస్టుల్లో స్థానిక నిరుద్యోగు లకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో సింగరేణి, ఓబీ యా జమాన్యాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఇటీవల దినేశ్ హైకోర్టును ఆశ్రయించారు.సోమవారం పిటిషనర్ తరుపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి 8వారాల్లోగా ఓబీ కంపెనీల్లో 80శాతం వరకు స్థానిక, ప్రభావిత ప్రాంతాల్లోని నిరుద్యోగులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని సింగరేణి యాజమాన్యానికి హైకోర్టు ఆదేశాలు జారిచేసిందని పేర్కొన్నారు.

కార్పొరేట్ ఇఅండ్ఎం జీఎంకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబర్ 2 : సింగరేణి కార్పొరేట్ ఈ అండ్ఎం జీఎం ఫిజాల్డ్ జేసురత్నం ఏరియా జీఎం ఎల్వీ సూర్యనారాయణ సన్మానించారు. కార్పొరేట్ ఈఅండ్ జీఎంగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా ఆర్జీ-2 కు వచ్చిన సందర్భంగా జీఎం చాంబర్‌లో ఏరియా జీఎం, ఇతర అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189